Digital, tmedia.net.in

# టీ-మీడియా

tmedia.net.in

సామాజికం.. ప్రజల పక్షం...

సంపుటి : 8
సంచిక :336
పేజీలు :3

GSTIN: 36FDKPS1308P1ZX | Analytics ID: UA-194163459
Domain ID : DC7812B9B3101414BB98847D724E48B3A-IN

శుక్రవారం 17/07/2026 టీమీడియా మెయిన్ ఎడిషన్ ఎడిటర్ : శనగపాటి మురళీకృష్ణ

## నీళ్ల కోసం రోడ్డెక్కిన గురుకుల పాఠశాల బాలికలు



**టి మీడియా, జూలై 16 , వరంగల్ :**
మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలం గాంధీనగర్‌లోని సోషల్ వెల్ఫేర్ బాలికల గురుకుల పాఠశాల విద్యార్థులు నీటి సమస్య తీర్చాలంటూ రోడ్డు ఎక్కి ధర్నాకు దిగారు. గత నెల రోజులుగా నీటి సమస్యతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఉదయం లేవగానే కనీసం వాష్ రూమ్‌కి పోదామంటే కూడా నీళ్లు లేక ఇబ్బందులు పడుతున్నామని పేర్కొన్నారు.కనీసం బాత్రూంలో శుభ్రం చేయడానికి కూడా నీరు లేక మమ్మలను ఇబ్బందులకు గురి చేస్తున్నారని వాపోయారు. గురుకుల పాఠశాల యజమాన్యానికి చెబితే ఒక్కరు పది రూపాలయ చొప్పున చెల్లిస్తే మెటర్ రిపేర్ చేపిస్తాని ప్రధానోపాధ్యాయుడు చెప్తున్నాడని, సమస్యలు చెప్తే విద్యార్థులను ఉపాధ్యాయులు వేధిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే నీటి వసతి కల్పించాలని డిమాండ్ చేశారు.

# పూరీ జగన్నాథ రథయాత్రలో తొక్కిసలాట



### ఒకరు మృతి- అనేక మందికి గాయాలు

**టీ మీడియా ,జూలై 16, పూరీ :**
ఒడిశాలో గురువారం ప్రారంభమైన జగన్నాథుని రథయాత్రలో అపశ్రుతి జరిగింది. యాత్ర ప్రారంభమైన కొద్దిసేపటికే తొక్కిసలాట జరిగింది. ఈ ఘటనలో ఒకరు మృతి చెందగా, అనేక మంది గాయపడ్డారు. అయితే, మృతులకు సంబంధించిన వివరాలు ఇంకా తెలియరాలేదు. భక్తుల రద్దీ విపరీతంగా పెరగడంతో గందరగోళ పరిస్థితి నెలకొందని, ఈ నేపథ్యంలో గ్రాండ్ రోడ్ వద్ద ఈ ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. తొక్కిసలాట జరిగిన సమయంలో దాదాపు 120 మందికి శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు పడినట్లు ప్రాథమిక సమాచారం. ప్రత్యేక సహాయ యూనిట్–ూ=ఖ బృందాలు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టాయి. అస్వస్థతకు గురైన భక్తులను చికిత్స నిమిత్తం పూరీ మెడికల్ ఆసుపత్రికి తరలించాయి. పరిస్థితిని తాము నిశితంగా గమనిస్తున్నామని ఉత్సవానికి హాజరవుతున్న యాత్రికుల భద్రతను పర్యవేక్షించేందుకు అత్యవసర ప్రతిస్పందన చర్యలను ముమ్మరం చేశామని అధికారులు వెల్లడించారు.

**పూరీకి చేరుకున్న 2 లక్షల మంది భక్తులు**
మరోవైపు, పూరీలో వార్షిక రథ యాత్రను రాజు దివ్యసింగ్ దేవ్ 'ఛెరా పహన్‌రా' కార్యక్రమాన్ని నిర్వహించారు. సంప్రదాయం ప్రకారం వెండి పల్లకిలో ఆలయానికి చేరుకున్న రాజు రథాలపై ఆసీనులైన దేవుళ్లకు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం పూజారులు మంత్రోచ్ఛారణ చేస్తుండగా ఆయన జగన్నాథ స్వామి, బలభద్రుడు, సుభద్ర రథాలపై బంగారు చీపురుతో ఊడ్చే క్రతువును నిర్వహించారు. శ్రీక్షేత్ర గోవర్ధన పీఠానికి చెందిన జగద్గురు శంకరాచార్యులు దివ్య రథాలపై ఉన్న దేవతామూర్తులను దర్శించుకున్నారు. అనంతరం లక్షలాది భక్తుల జయజయ ధ్వానాల నడుమ రథయాత్ర సాగింది. స్వామివారి రథం లాగేందుకు భక్తులు పోటీపడ్డారు. లక్షలాదిగా వచ్చిన భక్తులతో పూరీ గ్రాండ్ రోడ్డు పూర్తిగా నిండిపోయింది.ఓ వైపు జోరుగా వర్షం కురుస్తున్న దాన్ని లెక్కచెయకుండా, భగవంతుని దర్శనం కోసం దాదాపు 2లక్షల మంది భక్తులు పూరీకి చేరుకున్నారు. ఆలయ ప్రాంగణంలో ఒడిస్సీతోపాటు వివిధ కళాకారులు చేస్తున్న సంప్రదాయ నృత్యాలు ఆకట్టుకుంటున్నాయి. బుధవారం పూరీలో ఏకంగా 143 మిల్లీ మీటర్లకు పైగా వర్షం కురిసింది. గురువారం ఉరుములతో కూడిన జల్లులు కురిసే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. అయిప్పటికీ ఉత్సవాలకు ఆటంకం కలగకుండా, రథాలు సాగే రహదారిలో నీరు నిలవకుండా చర్యలు చేపట్టారు. పూరీ గజపతి మహారాజు దివ్యసింగ్ దేవ్ సంప్రదాయబద్ధంగా బంగారు చీపురుతో రథాలను శుభ్రం చేసిన అనంతరం సాయంత్రం 4గంటలకు భక్తులు రథాల్ని లాగడం ప్రారంభించారు. రెండున్నర కిలోమీటర్ల దూరంలో ఉన్న గుండిచా ఆలయానికి రథాలు చేరుకుంటాయి. పోలీసులతో పాటు కేంద్ర బలగాలు, నావికాదళం, తీర గస్తీ దళాలకు చెందిన 13 వేల మంది సిబ్బందితో పటిష్టమైన బందోబస్తును ఏర్పాటు చేశారు.

**ఆకట్టుకుంటోన్న జగన్నాథుని సైకత శిల్పం**
ఇదిలా ఉండగా, పూరీ జగన్నాథుడి రథయాత్ర సందర్భంగా ప్రముఖ సైకత శిల్పి, పద్మశ్రీ అవార్డు గ్రహీత సుదర్శన్ పట్నాయక్ రూపొందించిన జగన్నాథుని సైకత శిల్పం ఆకట్టుకుంటోంది. ఈయన ఒడిశాలోని పూరీ తీరంలో జగన్నాథుడి రూపాన్ని అందంగా తీర్చిదిద్దారు. ప్రధాన శిల్పం చుట్టూ ఇసుకతో దాదాపు 100 చిన్న రథాలను రూపొందించారు. లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు సంపాదించడమే లక్ష్యంగా ఆయన ఈ సైకత శిల్పాన్ని రూపొందించారు.ఈ కళాఖండాన్నిదాదాపు 800 ఇసుక బస్తాలను ఉపయోగించి సుమారు 2 వేల 500 చదరపు అడుగుల విస్తీర్ణంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా తీర్చిదిద్దారు.

**గుజరాత్‌లో వేలాది మంది భక్తులు**
ఇక, గుజరాత్‌లోని రాజ్‌కోట్‌లోని భగవాన్ జగన్నాథుని 19వ రథయాత్ర అంగరంగవైభవంగా జరుగుతోంది. ఆషాఢ శుద్ధ విదియ పర్వదినాన్ని పురస్కరించుకుని ఈ ఉత్సవాలు జరుగుతున్నాయి. రాజ్‌కోట్‌లోని ప్రసిద్ధ మోకాజీ సర్కిల్ వద్ద ఉన్న జగన్నాథ ఆలయం నుంచి వేలాది మధ్య భక్తుల జయజయధ్వానాల మధ్య రథయాత్ర ప్రారంభమైంది. జగన్నాథ స్వామి, బలభద్రుడు, సుభద్రా దేవి విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేసి మంగళ హారతలు ఇచ్చారు. రథయాత్రలో అఘోర వేషధారణలోని కళాకారుల ప్రదర్శన కట్టిపడేసింది. శివుని సాంప్రదాయ వేషధారణలో మరికొంత మంది నందిపై కూర్చుని రథయాత్రను అనుసరించారు.

# హైదరాబాద్ మెట్రో రెండో దశ



### కాగితాల్లో తప్ప క్షేత్రస్థాయిలో పడని ముందడుగు

**టి మీడియా, జూలై 16 , హైదరాబాద్ బ్యూరో :**
హైదరాబాద్ నగర ప్రజల జీవనాడి మెట్రో మొదటిదశ పూర్తయిన 2020 ఫిబ్రవరి తర్వాత రెండోదశకు సంబంధించి వ్యవహారం నత్తనడక తీరును తలపిస్తోంది. వ్యవహారమంతా కాగితాల్లో తప్ప క్షేత్రస్థాయిలో ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య ఈ వ్యవహారం ఒక బంతి ఆటలా మారింది. గత బీఆర్?ఎస్? ప్రభుత్వం, ఇప్పుడున్న కాంగ్రెస్ ప్రభుత్వం రెండోదశ డీపీఆర్(సమగ్ర ప్రాజెక్టు నివేదిక)లను దిల్లీకి పంపగా కొర్రీలు వేస్తూ కేంద్ర ప్రభుత్వం నాలుగేళ్లుగా సాగదీస్తోంది. ఒకసారి మెట్రోలైట్(ఈ–బీఆర్‌టీఎస్), మరోసారి ర్యాపిడ్ రైల్ ట్రాన్సిట్ సిస్టమ్(ఆర్ఆర్‌టీఎస్) అంటూ సమయం వృథా చేస్తోందనే విమర్శలు వినపడుతున్నాయి.

**నాడు జాప్యం**
మొదటిదశ మెట్రో పూర్తి కావొస్తుండంతో రెండోదశ ప్రతిపాదనలను కేంద్రానికి పంపేందుకు గత బీఆర్?ఎస్? ప్రభుత్వం తాత్సారం చేసింది. రెండోదశలో నాగోల్ నుంచి ఎల్బీనగర్ 5 కిలో మీటర్లు, లక్డీకాపూల్ నుంచి గచ్చిబౌలి–కొండాపూర్–మియాపూర్ చౌరస్తా(పాత మెట్రోని కలుపుతూ), బీహెచ్ఈఎల్ వరకు 26 కిలో మీటర్లను ప్రతిపాదించారు. డీపీఆర్‌లు సిద్ధమైనా నాడు కేబినెట్ ఆమోదానికే బీఆర్?ఎస్? ప్రభుత్వం నెలల తరబడి సమయాన్ని తీసుకుంది. ఎన్నికలు సమీపించడంతో హుటాహుటిన 2022 చివరలో కేంద్రానికి డీపీఆర్‌లను పంపారు. 2023లో సవరించిన డీపీఆర్‌లను కూడా రాష్ట్ర ప్రభుత్వం పంపింది. రెండు మార్గాలు కలిపి నాటి అంచనా వ్యయం రూ.8,453 కోట్లుగా చూపారు. అనుమతి ఇవ్వాలని కేంద్రాన్ని పలుమార్లు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కోరింది. ఈ మార్గంలో ప్రయాణికులు లేరని కేంద్రం అనుమతి పెండింగ్‌లో పెట్టిందని అధికారులు చెబుతున్నారు.


**తెరమీదకు కొత్తగా మెట్రోలైట్**
రూ.6,250 కోట్ల అంచనా వ్యయంతో రాయదుర్గం నుంచి శంషాబాద్ విమానాశ్రయానికి 31 కిలోమీటర్ల మార్గానికి మాజీ సీఎం కేసీఆర్ 2022 డిసెంబరు 9న శంకుస్థాపన చేశారు. దీనికి కేంద్రం నుంచి అనుమతి లభించలేదు. ప్రత్యామ్నాయంగా మెట్రోలైట్‌ను కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించింది. దీంతో కేపీహెచ్‌బీ నుంచి కోకాపేట వరకు మెట్రోలైట్(ఎలివెట్–బస్ ర్యాపిడ్ ట్రాన్సిట్ సిస్టమ్)ను కొత్తగా తెరమీదకు తీసుకొచ్చారు. ఈ ప్రతిపాదనలను కేంద్రం పక్కన పెట్టేయడం గమనార్హం.

**నేడు వెంటపడుతున్నా**
కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పగ్గాలు చేపట్టి రెండోదశ మెట్రో విస్తరణలో పలు మార్పులు, చేర్పులను చేసింది. తొలుత ఐదు కారిడార్ల డీపీఆర్‌లను కేంద్రానికి 2024లో సమర్పించారు. బడ్జెట్? పెట్టి నిధులు కేటాయించాలని కోరారు. ఇందులో పాతబస్తీ మెట్రో కూడా కలిసే ఉంది. అనుమతి రాకముందే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి 2024 మార్చి 8న శంకుస్థాపన కూడా చేశారు. ఫోర్త్‌సిటీ(భారత్? ఫ్యూచర్? సిటీ)తో ప్రజల డిమాండ్ల మేరకు శామీర్‌పేట, మేడ్చల్ కారిడార్లను కలిపి మరో మూడు కారిడార్లను జోడించారు.ఫోర్త్‌సిటీకి మెట్రో రెండోదశ నుంచి మినహాయించాలని కేంద్రం సూచించడంతో దానిని మూడోదశకు చేర్చారు. ఒకే యాజమాన్యం కిందనే మెట్రోరైలు ఉండాలని సూచించడంతో మెట్రోరైలు మొదటిదశకు సంబంధించి ప్రైవేట్ సంస్థ ఎల్అండ్‌టీ నుంచి పూర్తి వాటాను కొనుగోలుకు తెలంగాణ ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంది.

**ప్రత్యామ్నాయాలు తెర పైకి**
మెట్రో ప్రత్యామ్నాయంగా ర్యాపిడ్ రైల్ ట్రాన్సిట్ సిస్టమ్(ఆర్ఆర్‌టీఎస్) పరిశీలించాలని తెలంగాణ ప్రభుత్వాన్ని కేంద్ర ప్రభుత్వం కోరింది. దీని వల్ల భారీగా ఖర్చు తగ్గుతుందని సూచించింది. కిలోమీటర్‌కు ఒక స్టేషన్ ఉండే సిటీలో ర్యాపిడ్ రైల్ ఎలా సాధ్యమని రాష్ట్ర ప్రభుత్వం చెబుతోంది. మెట్రో రెండోదశ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ జాయింట్? ప్రాజెక్టుగా ఉంటే వేర్వేరు యాజమాన్యాలు అవుతాయి. సమస్య తలెత్తకుండా రెండోదశను సైతం రాష్ట్ర ప్రభుత్వమే సొంత నిధులతో చేపడుతుందని దానికైనా అనుమతి ఇవ్వాలని కోరుతోంది.

# వేధిస్తున్న మారు పేరు ముప్పు

### ఓటు హక్కు కోల్పోయే ప్రమాదంలో సింగరేణి విశ్రాంత ఉద్యోగులు



**టి మీడియా, జూలై 16 , హైదరాబాద్ బ్యూరో :**
ప్రస్తుతం రాష్ట్రంలో నడుస్తున్న సర్ ప్రక్రియ పలువురు ఓటర్లకు తలనొప్పి తెచ్చిపెడుతోంది. ప్రధానంగా సింగరేణిలో దశాబ్దాల కింద మారు పేరుతో ఉద్యోగంలో చేరి, ప్రస్తుతం జీవించి ఉన్న వారిలో చాలా మంది ఓటు హక్కు కోల్పోయే ప్రమాదం నెలకొంది. ఇలా పేరు మార్చుకొని కొలువు చేసి, పదవీ విరమణ పొంది తమ స్వగ్రామాల్లో ఉంటూ సొంత పేరుతో చెలామణి అవుతున్న వారితో పాటు వారి కుటుంబ సభ్యుల ఓటు హక్కు గల్లంతయ్యే ప్రమాదం ఏర్పడింది.

**సుమారు పాతిక వేల మంది వరకు**
1970 నుంచి 1990 మధ్య కాలంలో టెక్నాలజీ అంతలా అభివృద్ధి చెందలేదు. ఈ సమయంలో సింగరేణిలో జనరల్ మేనేజర్ (జీఎం) స్థాయిలోనే ఉద్యోగాలు కల్పించే వెసలుబాటు ఉండేది. దీంతో అక్కడ చాలా మంది ఇతరుల పేర్ల మీద కొలువుల్లో చేరారు. సింగరేణిలో ఉద్యోగుల సంఖ్య 2001 నాటికి లక్ష మందికిపైనే. ప్రస్తుతం ఇది 40 వేలకు తగ్గిపోయింది. పదవీ విరమణ పొందిన వారిలో ప్రస్తుతం 10 వేల మంది జీవించి ఉండగా, వారి కుటుంబ సభ్యులతో కలిపి 25 వేలకు చేరుతోంది.

**పేర్లు ఎందుకు మార్చుకున్నారంటే**
అప్పట్లో బొగ్గు టబ్బుల చక్రాలు, ఇసుక బస్తాలు ఎత్తడం, పరుగు పందెం వంటి పద్ధతుల ద్వారా వేల సంఖ్యలో సింగరేణి కొలువుల్లో చేరారు. ఆ కాలంలో గని ప్రమాదాలు ఎక్కువగా జరిగేవి. దీంతో చాలా మంది పని చేసేందుకు మొగ్గు చూపేవారు కాదు. అయితే, ఎంప్లాయ్?మెంట్ కార్డు ఉన్నవారికి డబ్బు చెల్లించి ఇతరులు దాన్ని వినియోగించుకున్నారు. ఈ క్రమంలో ఆ కార్డులోని పేరు మీదనే చాలా మంది గనిలో ఉద్యోగాల్లోకెక్కారు. దీనికి తోడు అప్పుడు జీఎంల స్థాయిలో ఉద్యోగ నియామకం ఉండటం వల్ల డబ్బులు తీసుకొని వారికి తెలిసిన వారిని, బంధువులను నియమించారు. ఈ విధంగా కార్డులోని మారు పేర్లతో చేరినవారు ఉద్యోగంలో కొనసాగినంత వరకూ అదే పేరుతోనే పని చేశారు.

**2002 నాటి ఓటరు జాబితా కోసం**
సాధారణంగా కోల్?బెల్ట్?లో ఒక చోటు నుంచి మరో ప్రాంతానికి బదిలీలు జరుగుతుంటాయి. ఇలా చాలా మంది అధికారులు, శ్రామికులు ఒక జిల్లా నుంచి మరో జిల్లాకు ట్రాన్స్?ఫర్? అయ్యారు. ఇప్పుడు వారు 2002 నాటి ఓటరు జాబితా ఎక్కడ దొరుకుతుందో తెలియక ఎంతో అవస్థ పడుతున్నారు. చదువుకున్నవారితో పాటు విద్యావంతులైన పిల్లల సహాయం ద్వారా పలువురు 2002 నాటి జాబితాను ఆన్?లైన్?లో పొందగలిగారు. అయినా చాలా మందికి సర్ సమాచారం అందకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చిరునామా మారిన వారి వివరాలు బీఎల్?ఓలకు తెలియక ఆచూకీ కోసం వారు ఇబ్బంది పడుతున్నారు.

**'అసలు పేరు రాసే అవకాశం లేదు'**
కరోనా సమయంలో రమణయ్య (పేరు మార్చాం) అనే ఓ విశ్రాంత ఉద్యోగి చనిపోయారు. ఈయన గతంలో మారు పేరుతో గనిలో ఉద్యోగం చేశారు. ఈయనకు ముగ్గురు కుమారుల్లో మెడికల్ ఇన్వాలిడేషన్ ద్వారా ఒకరికి కొలువు ఇప్పించారు. తండ్రి మారు పేరుతో ఉన్న ఇంటిపేరుతోనే కుమారుడు కూడా తన పేరును కొనసాగించి ఉద్యోగంలో చేరాడు. తమ తండ్రి అసలు పేరుతో చెలామణి అవుతున్న మిగితా ఇద్దరు కుమారులకు ఇప్పుడు సమస్యగా ఎదురైంది. 2002 తమ తండ్రి పేరు ప్రకారం ఇప్పుడు సర్? జాబితాలో నింపడానికి అవకాశం లేకుండా పోయిందని వారిద్దరు వాపోతున్నారు.

**సొంత పేరుతో ఓటు కోల్పోయే ప్రమాదం**
రామయ్య (అసలు పేరు కాదు) అనే ఓ రిటైర్డ్ ఉద్యోగి రాజి రెడ్డి అనే పేరుతో గతం ఉద్యోగంలో చేరారు. పదవీ విరమణ పొందిన తర్వాత సొంతూరుకు వెళ్లి వ్యవసాయ భూములను చూసుకుంటూ సొంత పేరుతో చెలామణి అవుతున్నారు. క్రమంగా అన్ని రికార్డుల్లోనూ ఇదే పేరును వినియోగించారు. అయితే, పాత మారు పేరు లేకపోవడంతో అతని భార్యాపిల్లల ఓట్లు కూడా కోల్పోయే ప్రమాదం నెలకొందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**అత్యధికంగా అలియాస్ పేర్లే**
సింగరేణిలో 2002 నాటికి 1.05 లక్షల మంది ఉద్యోగులు ఉండేవారు. అప్పటి నుంచి ఇప్పటి దాకా సుమారు 65 వేల మంది వరకు ఉద్యోగ విరమణ చేసి ఉండొచ్చు. వీరిలో 80 శాతం మంది నిరక్షరాస్యులే ఉన్నారు. దీంతో చాలా మంది అలియాస్ పేర్లతో ఉన్నవారి సంఖ్యే అధికం. గతంలో రాష్ట్ర ప్రభుత్వం ఇలా అలియాస్ పేర్లను క్రమబద్ధీకరణ చేయాలని కసరత్తు చేసింది. కానీ, పలు కారణాలతో అది కార్యరూపం దాల్చకపోవడంతో ఈ సమస్య అలాగే ఉండిపోయింది.

# ఖైదీల విడుదలపై పాలసీ

### రాష్ట్రాలకు సుప్రీం కోర్టు కీలక ఆదేశాలు

### 3 నెలల గడువు

**టీ మీడియా ,జూలై 16,ఢిల్లీ బ్యూరో:**
దేశంలోని జైళ్లలో మగ్గుతున్న వృద్ధులు, ప్రాణాంతక వ్యాధులతో (టెర్మినల్ ఇల్‌నెస్) బాధపడుతున్న ఖైదీలకు మానవతా దృక్పథంతో ఉపశమనం కల్పించేలా సుప్రీం కోర్టు గురువారం ఒక చరిత్రాత్మక తీర్పును వెలువరించింది. వృద్ధాప్య సమస్యలతో సతమతమవుతున్న లేదా నయం కానీ వ్యాధులతో ఉన్న ఖైదీల ముందస్తు విడుదల విషయంలో కీలక వ్యాఖ్యలు చేసింది. 3 నెలల వ్యవధిలోగా ఒక సమగ్రమైన విధానాన్ని రూపొందించి, నోటిఫై చేయాలని దేశంలోని అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్ని సుప్రీం కోర్టు ఆదేశించింది.

**నల్సా పిటిషన్‌పై స్పందన**
జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన సుప్రీం కోర్టు ద్విసభ్య ధర్మాసనం ఈ సంచలన తీర్పును ఇచ్చింది. జైళ్లలో ప్రాణాంతక వ్యాధులతో బాధపడుతున్న ఖైదీలు లేదా 70 ఏళ్లు పైబడిన వారిని బెయిల్‌పై విడుదల చేయాలని కోరుతూ నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన కోర్టు ఈ నిర్ణయం తీసుకుంది. ఖైదీల విడుదల ప్రక్రియకు సంబంధించిన అన్ని అర్హత ప్రమాణాలు, అనుసరించాల్సిన విధానాల్ని ఆ పాలసీలో స్పష్టంగా పొందుపరచాలని ధర్మాసనం పేర్కొంది.ముఖ్యంగా ఎవరిని విడుదల చేయాలనే విషయంలో గందరగోళం లేకుండా ఉండేందుకు ప్రాణాంతక వ్యాధి అనే దానికి స్పష్టమైన, ఒకే రకమైన నిర్వచనాన్ని రాష్ట్రాలు తయారు చేయాలని కోర్టు ఆదేశించింది. రాష్ట్రాల్ని బట్టి ప్రస్తుతం వేర్వేరు ప్రమాణాలు పాటించే అవకాశం ఉన్నందున, ఖైదీల అర్హత నిర్ణయంలో ఈ పాలసీల రూపకల్పనలో ఏకరీతి విధానం అవసరం అని పేర్కొంది. ఇందుకోసం సంబంధిత రాష్ట్రాల లీగల్ సర్వీసెస్ అథారిటీలతో (ూూూం) సంప్రదింపులు జరిపి సలహాలను కూడా తీసుకోవాలని సూచించింది. దీంతో ఖైదీల గుర్తింపు మరింత వేగంగా జరుగుతుందని, దరఖాస్తుల్ని సమర్థంగా పరిశీలించడం సులభం అవుతుందని ధర్మాసనం అభిప్రాయపడింది.

**సమయపాలన, పారదర్శకత తప్పనిసరి**
వీరి కారుణ్య విడుదల కోసం సుప్రీం కోర్టు కీలక మార్గదర్శకాలు జారీ చేసింది. ఖైదీలు స్వయంగా లేదా వారి కుటుంబ సభ్యులు దరఖాస్తు చేసుకునేందుకు వీలుగా సులభమైన, పారదర్శకమైన ప్రక్రియ ఉండాలని పేర్కొంది. ఇంకా కాలయాపన కాకుండా కచ్చితమైన సమయ పరిమితిలోపు ఈ దరఖాస్తుల్ని పరిశీలించేలా ఒక సరళమైన విధానాన్ని తీసుకురావాలని కోర్టు స్పష్టం చేసింది.




# బీజేపీ నేతల పోలవరం ప్రాజెక్టు సందర్శన యాత్ర



### ⏭ కేంద్ర నిధుల సాధనే లక్ష్యంగా పర్యటన

**టి మీడియా, జూలై 16 , అమరావతి బ్యూరో :**
బీజేపీ నేతల పోలవరం ప్రాజెక్టు సందర్శన యాత్ర ప్రారంభమైయ్యింది. ప్రాజెక్టు నిర్మాణ స్థితిగతులు, పర్యాటక విభాగం అభివృద్ధి కోసం ప్రత్యేక నిధులు తీసుకురావడమే ధ్యేయంగా రాష్ట్ర బీజేపీ నేతలు రాజమహేంద్రవరం నుంచి పోలవరం ప్రాజెక్టు సందర్శన యాత్ర చేపట్టారు. రాజమహేంద్రవరం నుంచి ప్రారంభమైన ఈ యాత్ర తొర్రేడు–సీతానగరం–పురుషోత్తపట్నం మీదుగా ప్రాజెక్టు వైపు సాగుతోంది. వెయ్యి మందితో కూడిన కమల దళం కార్లతో పోలవరం ప్రాజెక్టు వద్దకు ర్యాలీగా వెళ్తున్నారు. ఈ భారీ ర్యాలీని ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి జెండా ఊపి ప్రారంభించారు. యాత్రలో కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్, మంత్రి సత్యకుమార్, ఎమ్మెల్సీ సోము వీర్రాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ మాట్లాడుతూ వైఎస్సార్సీపీ సర్కారు పోలవరం ప్రాజెక్టును తీవ్ర నిర్లక్ష్యం చేస్తే సీఎం చంద్రబాబు పరుగులు పెట్టిస్తున్నారని అన్నారు. పోలవరాన్ని జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించిన ప్రధాని మోదీ సత్వరం పూర్తి చేసేందుకు పూర్తి సహకారం అందిస్తున్నారని అన్నారు. త్వరలో పోలవరం కుడి కాలువకు నీరు సైతం విడుదల చేసే ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు. గత ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం పోలవరం ప్రాజెక్టు కోసం కేంద్రం నిధులిస్తే గత సర్కారు వినియోగించకుండా, పక్కదారి పట్టించిందని మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆరోపించారు. కూటమి ప్రభుత్వ రాకతో ప్రాజెక్టు వేగంగా పూర్తవుతుం

# రోడ్డు విస్తరణలో అందరికి సమ న్యాయం చేయాలి




**టీ మీడియా, జులై 16 పెబ్బేరు:**
వనపర్తి జిల్లా పెబ్బేరు పట్టణంలో రోడ్డు విస్తరణలో బాగంగా అందరికీ ఒకేలా న్యాయం చేయాలనీ మునిసిపల్ తీర్మానానికి అనుకూలంగా చేపట్టవలసిందిగా కోరుతూ భూ బాధితులకు ఒక్కొక్కరికి ఒకలా కాకుండా అందరికీ సమన్యాయం జరిగేలా చూడాలని లేనిచో బాధితులకు న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామని విన్నవిస్తూ మున్సిపల్ కమిషనర్ కు భారతీయ జనతా పార్టీ పెబ్బేరు పట్టణ శాఖ తరపున వినతి పత్రం అందజేయటం జరిగింది ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు కావలి క్రాంతికుమార్ జిల్లా కౌన్సిల్ మెంబర్ సురవరం రంగస్వామి గౌడ్ జిల్లా అధికార ప్రతినిధి కంచ ఆంజనేయులు జిల్లా ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షుడు చింతల రామకృష్ణ పట్టణ ప్రధాన కార్యదర్శి సర్వేశ్వర్ గౌడ్ జిల్లా బీజేవైఎం జనరల్ సెక్రెటరీ చింతకాయల శివ రోడ్డు విస్తరణలో ఇల్లు కోల్పోయిన బాధితులు పాల్గొన్నారు.

# అమెరికాలో భారతీయుడిపై కత్తితో దాడి



### ⏭ మతం అడిగి 15 సార్లు పొడిచిన నిందితుడు

**టి మీడియా, జూలై 16 ,ఢిల్లీ బ్యూరో :**
అమెరికాలో ఉటా రాష్ట్రంలో ఓ భారతీయుడిపై కత్తితో దారుణంగా దాడి జరిగిన ఘటన కలకలం రేపింది. షాపింగ్ మాల్‌లో పనిచేస్తున్న భారతీయుడిని అతడి మతం గురించి ప్రశ్నించాడు ఓ వ్యక్తి. అనంతరం విచక్షణారహితంగా కత్తితో 15 సార్లు దాడి చేసినట్లు స్థానిక మీడియా కథనాలు వెల్లడించాయి. ఈ ఘటనలో బాధితుడు తీవ్రంగా గాయపడగా ఆస్పత్రిలో శస్త్రచికిత్స నిర్వహించారు. దాడిని అడ్డుకునేందుకు కొందరు ప్రయత్నించగా, ఈ క్రమంలోనే నిందితుడికి కూడా గాయాలయ్యాయి. మరోవైపు ఈ ఘటనపై భారత కాన్సులేట్ స్పందించింది.

**మాల్‌లో పని చేస్తున్న సమయంలో దాడి**

పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం, బాధితుడు సయ్యద్ సోహైలుద్దీన్ ఉటా రాష్ట్రంలోని వెస్ట్ వ్యాలీ సిటీలో ఉన్న వ్యాలీ సిటీ మాల్‌లో ఉద్యోగిగా పనిచేస్తున్నారు. సోమవారం మధ్యాహ్నం మాల్‌లోకి వచ్చిన 48 ఏళ్ల పీటర్ మైఖేల్ లార్సన్ అనే వ్యక్తి ముందుగా సోహైలుద్దీన్ వద్దకు వెళ్లాడు. 'నీ పేరు ఏమిటి? ఎక్కడి నుంచి వచ్చావు? నీ మతం ఏంటి?" అని ప్రశ్నించాడు. అనంతరం కత్తితో వరుసగా దాడి చేసి సుమారు 15 సార్లు పొడిచినట్లు పోలీసులు తెలిపారు. అక్కడే ఉన్న కొంతమంది వెంటనే స్పందించి నిందితుడిని అడ్డుకున్నారు. వారు నిందితుడి చేతిలోని కత్తిని లాక్కొని పోలీసులకు అప్పగించారు. అడ్డుకునే క్రమంలో లారెన్స్ తలపై గుద్దడంతో అతడికి కూడా గాయాలయ్యాయి.

**బాధితుడికి శస్త్రచికిత్స**

దాడిలో సోహైల్ ఉద్దీన్ శరీరంలోని పలు భాగాల్లో తీవ్ర గాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడిన సోహైలుద్దీన్‌ను వెంటనే ఆస్పత్రికి తరలించారు. వైద్యులు అత్యవసర శస్త్రచికిత్స నిర్వహించినట్లు సమాచారం. ప్రస్తుతం ట్రామా విభాగంలో వైద్యుల పర్యవేక్షణలో చికిత్స కొనసాగుతోంది. బాధితుడి కుటుంబ స్నేహితుడు మాట్లాడుతూ, తీవ్ర గాయాల మధ్య కూడా సోహైల్ ప్రాణాలతో బయటపడటం ఒక అద్భుతమేనని వ్యాఖ్యానించారు మరోవైపు, దాడిని అడ్డుకునేందుకు ప్రయత్నించిన వారి వల్ల గాయపడిన నిందితుడికి కూడా ఆస్పత్రిలో చికిత్స అందించిన తర్వాత పోలీసు కస్టడీలోకి తీసుకున్నారు. పోలీసుల విచారణలో నిందితుడు సంచలన విషయాలు వెల్లడించినట్లుగా కోర్టు పత్రాల్లో పేర్కొన్నారు. బాధితుడిని అతని మత విశ్వాసాల కారణంగానే లక్ష్యంగా చేసుకున్నట్లు నిందితుడు అంగీకరించినట్లు అధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలో హత్యాయత్నం, నిషేధిత ప్రమాదకర ఆయుధాన్ని కలిగి ఉండటం వంటి అభియోగాలపై కేసు నమోదు చేసి సాల్ట్ లేక్ కౌంటీ మెట్రో జైలుకు తరలించారు. దర్యాప్తు అధికారులు, నిందితుడి తీవ్రవాద భావజాలం దృష్ట్యా బెయిల్ మంజూరు చేయరాదని కోర్టును కోరారు.

**భారత కాన్సులేట్ స్పందన**

ఈ ఘటనపై శాన్ ఫ్రాన్సిస్కోలోని భారత కాన్సులేట్ జనరల్ తీవ్ర విచారం వ్యక్తం చేసింది. బాధితుడి కుటుంబ సభ్యులు, స్నేహితులతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నామని తెలిపింది. అవసరమైన అన్ని కాన్సులర్ సేవలు అందించేందుకు సిద్ధంగా ఉన్నామని వెల్లడించింది. అలాగే స్థానిక అధికారులతో నిరంతరం సంప్రదింపులు కొనసాగిస్తున్నామని, కేసు పురోగతిని నిశితంగా పరిశీలిస్తున్నామని భారత కాన్సులేట్ ఒక ప్రకటనలో పేర్కొంది.

**ధైర్యంగా స్పందించిన ప్రత్యక్ష సాక్షులు**

దాడి జరిగిన వెంటనే నిందితుడిని అడ్డుకుని అదుపులోకి తీసుకున్న మాల్ సందర్శకుల ధైర్యసాహసాలను స్థానిక పోలీసులు, ప్రజలు ప్రశంసిస్తున్నారు. వారు వెంటనే స్పందించకపోయి ఉంటే మరింత పెద్ద విషాదం జరిగి ఉండేదని అధికారులు అభిప్రాయపడుతున్నారు. ఈ ఘటన తర్వాత స్థానిక సమాజంలో తీవ్ర ఆందోళన నెలకొంది. ఉటా ఇస్లామిక్ సెంటర్‌కు చెందిన ఇమామ్ షుఐబ్ దిన్ మాట్లాడుతూ, ఇటీవల సంవత్సరాల్లో తమ వర్గంపై వేధింపులు, బెదిరింపులు పెరిగాయని, అయితే ఈ దాడి తమ సమాజంపై జరిగిన అత్యంత తీవ్రమైన ఘటనగా అభివర్ణించారు.

# గుడికి తీసుకెళ్లింది

## ప్రియుడితో కలిసి భర్తను చంపేసింది

**టి మీడియా, జూలై 16 , చిత్తూరు :**
వైవాహిక బంధానికి తూట్లు పడుతున్నాయి. దాంపత్య జీవితం మీద అభిప్రాయాలు మారిపోతున్నాయి. అయితే అత్యంత పవిత్రమైన ఈ బంధం ఎందుకిలా అయ్యింది? పెళ్లి అంటేనే భయం పుట్టించే ఘటనలు జరగడమే దీనికి ముఖ్య కారణం. నిండు నూరేళ్లు ఒకరికొకరు కలిసి జీవించాల్సిన వాళ్లే వివాహేతర బంధాల ఉచ్చులో పడి పచ్చటి కుటుంబాల్ని ఛిద్రం చేసుకుంటున్నారు. వివాహేత బంధానికి అడ్డుగా ఉన్నాడని భార్య తన ప్రియుడితో కలిసి భార్తను మట్టుబెట్టింది. ఈ ఘటన చిత్తూరు జిల్లాలో జరిగింది. వివాహేతర బంధానికి అడ్డొస్తుండటంతో భర్తను గుడికి అని బయటకు తీసుకెళ్లి భార్య హత్య చేసిన ఘటన చిత్తూరు జిల్లా గుడుపల్లె మండలంలో జరిగింది. ఈ ఘటనకు సంబంధించి కుప్పం డీఎస్పీ పార్థసారధి బుధవారం తెలిపిన మేరకు తమిళనాడులోని సూలగిరి పరిధి దేవసానపల్లెకు చెందిన రమేష్ హోసూరులో ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నారు. అతనికి కుప్పం నియోజకవర్గం బోయనపల్లెకు చెందిన హాసినితో రెండేళ్ల కిందట వివాహమైంది. వీరికి ఏడాది వయసున్న మౌలికశ్రీ సంతానం.

**పక్కా ప్లాన్**

ద్విచక్రవాహనంపై భర్త కుమార్తెతో పాటు హాసిని గుడిపల్లి మండలంలోని మల్లప్ప కొండ ఆలయానికి చేరుకుంది. అక్కడ ఘాట్ రోడ్డులో మూడో మలుపు వద్ద తన చరవాణి ఫోను పడేసింది. ఫోన్ పడిపోయింది తీసుకోవాలంటూ భర్తకు చెప్పి ద్విచక్ర వాహనాన్ని ఆపించింది. అప్పటికే అక్కడ పొంచి ఉన్న తన ప్రియుడితోపాటు మరో ఇద్దరు యువకులు రమేష్‌ను పొదల్లోకి లాక్కెళ్లి కత్తి, చాకుతో దారుణంగా హతమార్చారు. ఆధారాలను ధ్వంసం చేసే క్రమంలో దుస్తులు, గ్లౌజులను అక్కడ మంటల్లో కాల్చేశారు.





**సీసీటీవీ ఫుటేజీలో దృశ్యాలు**

హాసిని తల్లి రుక్మిణమ్మ ఫిర్యాదు మేరకు సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి విచారణ చేపట్టారు. తిరుగు ప్రయాణంలో భర్త తెచ్చిన బైక్‌పైనే మరో ఇద్దరు యువకులతో కలిసి తిరిగి వెళు న్నట్లు గుర్తించారు. వాటి ఆధారంగా అటవీ ప్రాంతంలో గాలింపు చర్యలు చేపట్టగా మల్లప్పకొండ ఘాట్ రోడ్డు సమీపంలో రమేష్ మృతదేహం లభించింది. రమేష్ భార్యే మరో ఇద్దరితో కలిసి హత్య చేసినట్లు పోలీసులు ప్రాథమికంగా తేల్చారు. అనుమానితులు పోలీసుల అదుపులో ఉన్నట్లు తెలిసింది. నిందితులు పోలీసుల ఎదుట లొంగిపోయినట్లు సమాచారం.

# 'కార్పొరేట్ మిత్ర' పథకం.. దరఖాస్తులు ప్రారంభం

**టి మీడియా, జూలై 16 ,ఢిల్లీ బ్యూరో:**
దేశంలో సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల లకు తక్కువ ఖర్చుతో వృత్తిపరమైన సేవలను అందించడానికి కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన నూతన పథకం 'కార్పొరేట్ మిత్ర'. దీని ద్వారా శిక్షణ పొందిన నిపుణులు చిన్న వ్యాపారాలకు ఆర్థిక, అకౌంటింగ్, చట్టపరమైన విషయాల్లో సహాయం చేస్తారు. ఉద్యోగాల సాధన దిశగా యువతను ప్రోత్సహించడానికి, ఎంఎస్ఎంఈ రంగ బలోపేతానికి కేంద్ర కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించింది. దేశవ్యాప్తంగా శిక్షణ పొందిన పారా–ప్రొఫెషనల్స్ పూల్‌ను తయారుచేసే లక్ష్యంతో 'కార్పొరేట్ మిత్ర' ఫ్లాగ్‌షిప్ ప్రోగ్రామ్‌కు నోటిఫికేషన్ విడుదలైంది. దేశంలో ప్రతిష్ఠాత్మక విద్యా సంస్థలైన ఐసిఎఐ, ఐసిఎస్ఐ, ఐసిఎంఎఐ ల అకాడమిక్ భాగస్వామ్యంతో, ఐఐటీ మద్రాస్ ద్వారా ఈ కోర్సును అందిస్తున్నారు. ఈ కోర్సు పూర్తి చేసుకున్న వారికి ఎంఎస్ఎంఈ సంస్థల్లో అకౌంటింగ్, ట్యాక్సేషన్, బ్యాంకింగ్, లీగల్ వంటి రంగాల్లో అపారమైన ఉపాధి అవకాశాలు లభిస్తాయి.

**ముఖ్యమైన తేదీలు** : దీనికి దరఖాస్తులు జూలై 15 నుంచి ప్రారంభమయ్యాయి. జూలై 31 వరకు దరఖాస్తులు తీసుకుంటారు. మొదటి బ్యాచ్ కింద దేశవ్యాప్తంగా కేవలం 2,000 మంది అభ్యర్థులను మాత్రమే 'మొదట వచ్చిన వారికి మొదటి ప్రాధాన్యత , ప్రాతిపదికన ఎంపిక చేస్తారు.

**అర్హతలు** : దరఖాస్తు చేసుకునే నాటికి అభ్యర్థి వయస్సు 30 సంవ త్సరాల్లోపు ఉండాలి. ఏదైనా విభాగంలో డిగ్రీ ఉత్తీ ర్ణులైన వారు లేదా ప్రస్తుతం డిగ్రీ చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులు.

**కోర్సు వివరాలు**మొత్తం 12 నెలల వ్యవధి గల ఈ కోర్సును రెండు భాగాలుగా విభజించారు. మొదటి 6 నెలలు (అకాడమిక్ లెర్నింగ్) స్వయం ప్లస్ పోర్టల్ ద్వారా 150 గంటల ఆన్‌లైన్ క్లాసులు ఉంటాయి. తదుపరి 6 నెలలు (ఆన్–ది–జాబ్ ట్రైనింగ్) ప్రముఖ ప్రొఫెషనల్ సంస్థల్లో ప్రాక్టికల్ ట్రైనింగ్ పొందే అవకాశం కల్పిస్తారు. దీని ద్వారా అభ్యర్థులు స్టైపెండ్ కూడా పొందవచ్చు.

# రికార్డు స్థాయిలో టీటీడీకి విరాళాలు

### ⏭ ఒక్కరోజే ఏకంగా రూ.96.98 కోట్లు

**టీ మీడియా, జూలై 16, తిరుపతి :**
శ్రీవేంకటేశ్వర స్వామి కొలువై ఉన్న తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ)కి భక్తుల నుంచి భారీగా విరాళాలు పోటెత్తాయి. టీటీడీ ఆధ్వర్యంలో నడుస్తున్న వివిధ ట్రస్టులకు మంగళవారం రికార్డు స్థాయిలో విరాళాలు అందాయి. దాతలు స్పందించి ఒక్కరోజే ఏకంగా రూ.96.98 కోట్ల మేర విరాళాలు సమర్పించారు.


**పాత విధానం కోసమే క్యూ**

విరాళాలు ఇంత భారీగా, ఒక్కసారిగా రావడానికి ఓ ప్రధాన కారణం ఉంది. టీటీడీ దాతలకు అందించే ప్రివిలేజెస్ (ప్రత్యేక సదుపాయాలు) విధానంలో అధికారులు కీలక మార్పులు తీసుకువచ్చారు. ఈ నూతన విధానం బుధవారం నుంచి అమలులోకి వచ్చింది. దీంతో పాత విధానం ద్వారా లబ్ధి పొందేందుకు దాతలు ఒక్కసారిగా క్యూ కట్టారు. పాత విధానం ముగిసేలోపు విరాళాలు అందించిన వారికి, పాత సదుపాయాలే కొనసాగుతాయని టీటీడీ ప్రకటించడమే ఈ రికార్డు స్థాయి స్పందనకు కారణం.

**ఒక్కరోజే 2,460 మంది**

మంగళవారం ఒక్కరోజే మొత్తం 2,460 మంది దాతలు తమ విరాళాలను టీటీడీకి సమర్పించారు. టెక్నాలజీని ఉపయోగించుకుని అత్యధికంగా ఆన్‌లైన్ ద్వారా 2,354 మంది విరాళాలు అందించారు. ఆఫ్‌లైన్ ద్వారా 106 మంది విరాళాలు అందజేశారు. విరాళాల స్థాయిని బట్టి చూస్తే రూ.లక్ష నుంచి రూ.10 లక్షలలోపు విరాళాలు అందించిన వారు 1,212 మంది ఉన్నారు. రూ.10 లక్షల నుంచి రూ.25 లక్షలలోపు విరాళం ఇచ్చిన వారు 1,246 మంది ఉన్నారు. ఇక కోటి రూపాయలు, అంతకంటే పైగా విరాళం సమర్పించిన దాతలు ఇద్దరు ఉండటం విశేషం.

**సామాన్యుల కోసమే ఈ మార్పులు**



దాతల ప్రివిలేజ్ విధానంలో మార్పులు తీసుకురావడం వెనుక సామాన్య భక్తుల ప్రయోజనాలే దాగి ఉన్నాయని అధికారులు చెబుతున్నారు. రాబోయే రోజుల్లో సాధారణ భక్తుల దర్శనాలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలన్న ఉద్దేశంతోనే టీటీడీ ఈ కీలక నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగానే దాతలకు కల్పించే ప్రత్యేక సదుపాయాలను కొంతమేర తగ్గిస్తూ బుధవారం నుంచి నూతన పాలసీని అధికారికంగా అమలులోకి తెచ్చింది.

**లక్షల్లో నమోదైన దాతలు**

శ్రీవారి ట్రస్టులకు వివిధ రూపాల్లో విరాళాలు అందించే దాతల సంఖ్య చాలా భారీగానే ఉంది. జూన్ 26వ తేదీ నాటికి ఉన్న గణాంకాల ప్రకారం టీటీడీలో మొత్తం 1,97,888 మంది దాతలుగా నమోదు చేసుకున్నారు. వీరిలో రూ.లక్ష విరాళం ఇచ్చిన వారు సుమారు 1,50,000 మంది వరకు ఉన్నారు. ఇక రూ.10 లక్షల విరాళం ఇచ్చిన దాతలు దాదాపు 22 వేల మంది వరకు ఉన్నట్లు అధికారులు వెల్లడించారు.

# తెరపైకి మళ్లీ డీలిమిటేషన్ బిల్లులు!

## మారిన రాజకీయ సమీకరణాలు



**టి మీడియా, జూలై 16 ,ఢిల్లీ బ్యూరో :**
పార్లమెంటు వర్షాకాల సమావేశాలు మళ్లీ రాజకీయంగా ఆసక్తిని రేపుతున్నాయి. బడ్జెట్ సమావేశాల్లో సంఖ్యా బలం చాలక ఆమోదానికి నోచుకోని రాజ్యాంగ సవరణ బిల్లులను జులై 20 నుంచి జరిగే వర్షాకాల సమావేశాల్లో గట్టెక్కించేందుకు మోదీ సర్కార్ పావులు కదుపుతున్నట్లు తెలుస్తోంది. లోక్‌సభ, అసెంబ్లీ నియోజకవర్గాల పునర్విభజన మహిళా రిజర్వేషన్ల బిల్లులను మళ్లీ తెరపైకి తెచ్చే ప్రయత్నాలు ముమ్మరమయ్యాయి. ఏప్రిల్‌లో ఆమోదం పొందని బిల్లులు మరి ఇప్పుడు ఎలా ఆమోదం పొందుతాయి? మూడు నెలల్లో ఉభయ సభల్లో మారిన పార్టీ బలాబలాలు ఎన్డీయేకు ఏ మేరకు కలిసి వస్తాయి? ఇప్పుడు తెలుసుకుందాం.

**సంఖ్యా బలం సరిపోక ఆమోదం పొందలేకపోయిన బిల్లు**

పార్లమెంటు వర్షాకాల సమావేశాలు జులై 20నుంచి జరగనున్నాయి. ఈ సమావేశాల్లో ఒకే దేశం, ఒకే ఎన్నికల ప్రతిపాదన కింద నియోజకవర్గాల పునర్విభజనకు చట్ట సవరణ బిల్లును ఎన్డీయే సర్కార్ మళ్లీ తెరపైకి తెస్తుందని సమాచారం. మహిళా రిజర్వేషన్లతో ముడిపెట్టి లోక్‌సభ, రాష్ట్రాల అసెంబ్లీ నియోజకవర్గాల పునర్విభజన కోసం కేంద్రం ఏప్రిల్‌లో ప్రవేశపెట్టిన 131వ రాజ్యాంగ సవరణ బిల్లు అధికార కూటమి సంఖ్యా బలం సరిపోక ఆమోదం పొందలేకపోయింది. సాధారణ చట్టాల మాదిరిగా రాజ్యాంగ సవరణ బిల్లులను సాధారణ మెజారిటీతో ఆమోదించడం సాధ్యంకాదు. వీటికి ప్రత్యేక మెజారిటీ అవసరం. అందుకే ప్రతి ఎంపీ, ప్రతి ఖాళీ స్థానం, మారుతున్న ప్రతి రాజకీయ సమీకరణం చాలా కీలకం. రాజ్యాంగ సవరణ బిల్లు పార్లమెంటులోని ఉభయ సభలలోనూ రెండు అడ్డంకులను అధిగమించాలి. బిల్లు ఆమోదానికి సభలోని మొత్తం సభ్యుల సంఖ్యలో సగానికిపైగా మద్దతు ఉండాలి. అలాగే ఓటింగ్‌లో పాల్గొన్న సభ్యులలో కనీసం మూడింట రెండు వంతుల మంది మద్దతు ఇవ్వాలి. కచ్చితంగా ఇదే విషయంలో ఏప్రిల్ నెలలో బిల్లు ఆమోదింపచేయడంలో ఎన్డీయే సర్కార్ విఫలమైంది.

**బిల్లుకు అనుకూలంగా 298 ఓట్లు, వ్యతిరేకంగా 230 ఓట్లు**

ఏప్రిల్‌లో నియోజకవర్గాల పునర్విభజన, లోక్‌సభ, రాష్ట్రాల అసెంబ్లీల స్థానాల పెంపు తద్వారా మహిళా రిజర్వేషన్ల అమలు కోసం తెచ్చిన 131వ రాజ్యాంగ సవరణ బిల్లుకు అనుకూలంగా 298 ఓట్లు, వ్యతిరేకంగా 230 ఓట్లు వచ్చాయి. అనుకూలంగా ఎక్కువ ఓట్లు వచ్చిన బిల్లు ఆమోదానికి మరో 54 ఓట్లు తక్కువయ్యాయి. మొత్తం 528 మంది ఎంపీలు ఓటింగ్‌లో పాల్గొనగా మూడింట రెండు వంతుల మార్కు 352గా ఉంది. ఫలితంగా ఆ బిల్లును కేంద్రం ఉపసంహరించుకోవాల్సి వచ్చింది. దేశ రాజకీయాల్లో వచ్చిన అనూహ్య మార్పులతో మూడు నెలల్లోనే బిల్లు ప్రవేశపెట్టేందుకు కేంద్రం సమాయాత్తమవుతోందని సమాచారం. గత మూడు నెలల్లో సార్వత్రిక ఎన్నికలు జరగకపోయినప్పటికీ పార్టీ ఫిరాయింపులు, చీలికలు, మారుతున్న కూటములు, పార్లమెంటులో ఖాళీలతో రాజకీయ ముఖచిత్రం పూర్తిగా మారిపోయింది. ఈ పరిణామాలు ఎన్డీయేను బలోపేతం చేయగా, ప్రతిపక్షాల బలాన్ని క్రమంగా తగ్గించాయి.

**ఎన్డీయేకు కలిసి వచ్చిన తృణమూల్ కాంగ్రెస్‌లో చీలిక**

తృణమూల్ కాంగ్రెస్‌లో చీలిక ఎన్డీయేకు కలిసి వచ్చింది. టీఎంసీకి చెందిన 20 మంది అసమ్మతి ఎంపీలు పార్టీ నుంచి విడిపోయి 'నేషనలిస్ట్ సిటిజెన్స్ పార్టీ ఆఫ్ ఇండియా లో విలీనమైనట్లు తెలిపారు. ఎన్‌డిఎకు మద్దతు ప్రకటించారు. ఈ సమావేశాలకు ముందే స్పీకర్ అధికారికంగా ఈ విలీనాన్ని గుర్తిస్తే లోక్‌సభలో అధికార కూటమి బలానికి భారీ ఊతం లభిస్తుంది. ఉద్ధవ్ ఠాక్రే శివసేన వర్గానికి చెందిన ఆరుగురు ఎంపీలు ఎన్డీయే భాగస్వామ్య పక్షమైన ఏకనాథ్ శిందే శివసేనలో చేరారు. ఈ ఎంపీలకు గుర్తింపు లభిస్తే వారు ప్రతిపక్ష బెంచీల నుంచి అధికార కూటమి వైపు మారుతారు. ఇక టీవీకేకు కాంగ్రెస్ మద్దతివ్వడంతో దశాబ్దానికిపైగా కొనసాగిన కాంగ్రెస్–డీఎంకే కూటమి విచ్ఛిన్నమైంది. డీఎంకే అధికారికంగా ఎన్‌డిఎ లో చేరనప్పటికీ ఇండి కూటమి నుంచి అది నిష్క్రమించడం అంటే ప్రతిపక్షాలు ఇకపై ఆ పార్టీకి చెందిన 22 మంది లోక్‌సభ ఎంపీల మద్దతును పూర్తిగా నమ్ముకునే పరిస్థితిలేదు. కొన్ని ఎంపిక చేసిన చట్టాలపై డీఎంకే నుంచి అంశాల వారీగా మద్దతు పొందాలని బీజేపీ భావిస్తున్నట్లు సమాచారం. ఇటీవల జరిగిన రాజ్యసభ ఎన్నికలు వివిధ రాష్ట్రాల్లో పార్టీల బలాబలాల్లో వచ్చిన మార్పుల ద్వారా ఎగువ సభలో కూడా ఎన్డీయే తన పట్టును పెంచుకుంది. లోక్‌సభ సీట్లు 543 అయినప్పటికీ ఎంపీల మరణాల వల్ల 3 సీట్లు ఖాళీగా ఉన్నాయి. కాబట్టి సభలో అసలు సంఖ్య తగ్గింది. దీనివల్ల మూడింట రెండొంతుల మెజారిటీ సాధించడానికి అవసరమైన సంఖ్య కూడా తగ్గుతుంది.

**22 మంది డీఎంకే ఎంపీలు మద్దతిస్తే 341కి పెరగనున్న బలం**

రాజ్యాంగ సవరణ బిల్లు ఆమోదానికి ఎంపీల హాజరు కూడా చాలా ముఖ్యం. ఓటింగ్ సమయంలో ఎంపీలు గైర్హాజరైనా, వాకౌట్ చేసినా, సభకు దూరంగా ఉన్నా మెజారిటీ కూడా మారుతుంది. మూడింట రెండు వంతుల పరిమితి అనేది మొత్తం సభ్యుల సంఖ్య ఆధారంగా కాకుండా సభలో ఉండి ఓటు వేసిన సభ్యుల సంఖ్య ఆధారంగా లెక్కిస్తారు. అందుకే రాజ్యాంగ సవరణ ఓటింగ్ సమయంలో ప్రతి ఎంపీ హాజరయ్యేలా చూసేందుకు ప్రభుత్వాలు, ప్రతిపక్షాలు తమ శక్తినంతా ధారపోస్తాయి. ఏప్రిల్‌తో పోలిస్తే ఎన్డీయే ఇప్పుడు సంఖ్యాపరంగా చాలా మెరుగైన స్థితిలో ఉంది. కానీ ఇప్పటికీ సొంతంగా ప్రత్యేక మెజారిటీ సాధిస్తుందనే గ్యారెంటీ లేదు. ప్రస్తుతం లోక్‌సభలో అధికార కూటమికి దాదాపు 293 మంది ఎంపీల మద్దతు ఉంది. తృణమూల్‌కు చెందిన 20 మంది అసమ్మతి ఎంపీలు, యూబీటీ శివసేనకి చెందిన ఆరుగురు ఎంపీలు తోడైతే ఆ సంఖ్య 319కి చేరుతుంది. ఒకవేళ 22 మంది డీఎంకే ఎంపీలు అంశాల వారీగా మద్దతిస్తే ఎన్డీయే బలం దాదాపు 341కి పెరుగుతుంది. అయినప్పటికీ సభలో పూర్తి సంఖ్యలో ఎంపీలు హాజరైతే ఓటింగ్‌లో మూడింట రెండొంతుల మార్కు అందుకోవడానికి కేంద్రానికి ఇంకా కొంత సంఖ్యాబలం తగ్గుతుంది. కాబట్టి రాజ్యాంగ సవరణల బిల్లులను ముందుకు తీసుకెళ్లాలని ప్రభుత్వం నిర్ణయించుకుంటే ప్రాంతీయ పార్టీల మద్దతు, వ్యూహాత్మకంగా ఎంపీల గైర్హాజరీ, ప్రతిపక్షాల హాజరు తగ్గడం వంటి అంశాలపైనే బీజేపీ ఆధారపడే అవకాశం ఉంది.

# కనుల పండువగా మొదలైన గోల్కొండ బోనాలు

## తొలి బోనం సమర్పించిన కుమ్మర్లు



**టీమీడియా, జూలై 16 , హైదరాబాద్ బ్యూరో :**
తెలంగాణ సంస్కృతిని, సంప్రదాయాన్ని ప్రతిబింబించే ఆషాఢమాస బోనాల ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. చారిత్రాత్మకమైన శ్రీ జగదాంబికా మహంకాళి అమ్మవారికి 11 బోనాలతో కుమ్మరులు తొలి బోనం సమర్పించి ఉత్సవాలను లాంఛనంగా ప్రారంభించారు. హైదరాబాద్ లంగర్‌హౌస్ నుంచి ప్రభుత్వం తరఫున బంగారు బోనం, పట్టు వస్త్రాలను మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్ సమర్పించారు. అంతేకాకుండా రాష్ట్ర ప్రభుత్వం రూ. 15.05 కోట్లను ఈ ఉత్సవాల కోసం కేటాయించింది. బోనాలను సమర్పించేందుకు వచ్చిన భక్తులతో గోల్కొండ కోట కిటకిటలాడుతోంది.గోల్కొండ బోనాల వేడుకల్లో భాగంగా మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, స్పీకర్ గడ్డం ప్రసాద్‌తో పాటు పలువురు ప్రముఖులు జగదాంబిక అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. పట్టు వస్త్రాలు, బోనం సమర్పించారు. మంత్రి పొన్నం ప్రభాకర్ పోతురాజుల విన్యాసాల్లో ఉత్సాహంగా పాల్గొని, చేతిలో కొరడా పట్టుకుని నృత్యం చేయడం అందరినీ ఆకట్టుకుంది. కాంగ్రెస్ నేత వి.హనుమంతరావు అమ్మవారిని దర్శించుకుని పూజల్లో పాల్గొన్నారు.
బోనాలు ప్రారంభమైన మట్నదటిరోజే ఎంపీ ఈటల రాజేందర్ వచ్చి మట్నక్కులు చెల్లించుకొని, ప్రజలందరికి శుభాకాంక్షలు తెలిపారు. హైదరాబాద్ ప్రజల జీవన విధానం, సామాజిక ఐక్యతకు ప్రతీకగా నిలిచే బోనాల పండగ ఆధ్యాత్మిక, సాంస్కృతిక మహోత్సవమని ఈటల కొనియాడారు.

**2 వేల మంది బందోబస్తు**

ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా 2 వేల మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశామని హైదరాబాద్ సీపీ సజ్జనర్ తెలిపారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని రామ్‌దేవ్‌గూడ, లంగర్‌హౌస్, బంజారా దర్వాజా తదితర మార్గాల్లో రాత్రి 10 గంటల వరకు ట్రాఫిక్ ఆంక్షలు, మళ్లింపులు ఉంటాయని సీపీ తెలిపారు.లక్షలాది మంది భక్తులు హాజరుకానున్న నేపథ్యంలో చైన్ స్నాచింగ్, పిక్‌పాకెటింగ్ వంటి నేరాలను నివారించేందుకు హైదరాబాద్ పోలీసులు వినూత్న చర్యలు చేపట్టారు. నగరంలోని మోస్ట్ వాంటెడ్ చైన్ స్నాచర్ల ఫొటోలతో ప్రత్యేక హెచ్చరిక బ్యానర్లను రూపొందించి ప్రధాన కూడళ్లలో ప్రదర్శించారు. ఆభరణాలు, నగదు, ఫోన్ల విషయంలో భక్తులు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు.

# చినుకు పడక నీటి కొరత

### ⏭ ట్యాంకర్లకు పెరుగుతున్న డిమాండ్

**టి మీడియా, జూలై 16 , హైదరాబాద్ బ్యూరో :**
గ్రేటర్ హైదరాబాద్‌లో జులై నెలలోనూ జలమండలి ట్యాంకర్లకు భారీ డిమాండ్? కొనసాగుతోంది. ఎల్?నినో ప్రభావం వల్ల తీవ్రమైన వర్షాభావ పరిస్థితుల కారణంగా భూగర్భజలాలు అడుగంటడం వల్ల ఈ పరిస్థితి ఇంకా కొనసాగుతోంది. బుక్ చేసిన తర్వాత 2 నుంచి 5 రోజుల సమయం తీసుకుంటుంది. ఔటర్? రింగ్?రోడ్డు సమీపంలోని చాలా ప్రాంతాల్లో ట్యాంకర్లకు డిమాండ్ సాగుతుంది. సాధారణంగా జూన్? తర్వాత ట్యాంకర్ల డిమాండ్? భారీగా తగ్గాలి. కానీ ఈ ఏడాది మాత్రం పరిస్థితి మాత్రం భిన్నంగా ఉంది.

**ట్యాంకర్ల డిమాండ్ 3 రెట్లు పెరిగింది**

జులైలో రోజుకు 4 వేల కంటే తక్కువ ట్యాంకర్ల డిమాండ్? ఉండేది. ప్రస్తుతం 3 రెట్లు అధికమైంది. ఐటీ కారిడార్?తో పాటు బంజారాహిల్స్?, గచ్చిబౌలి, మాదాపూర్?, కొండాపూర్, షేక్?పేట, మియాపూర్?, కూకట్?పల్లి, ఉప్పల్?, కేపీహెచ్?బీ, మౌలాలి, పీర్జాదిగూడ, జీడిమెట్ల, బోడుప్పల్? ఫిల్లింగ్ స్టేషన్ల పరిధిలో ట్యాంకర్ల బుకింగ్? ఎక్కువగా ఉంటోంది. ఎల్?నినో వల్ల వర్షాభావంతో ఎండిన బోర్లు రీఛార్జ్ కాకపోవడంతో జనం నీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సాధారణంగా నీటి ఎద్దటి తక్కువగా ఉండే ఉప్పల్?, ఎల్?బీనగర్, మల్కాజిగిరి, ఎన్టీఆర్?నగర్ వంటి ప్రాంతాల్లో ఈసారి ట్యాంకర్ల బుకింగ్?లు పెరిగాయి.ఎల్?నినో ప్రభావం వల్ల గ్రేటర్ హైదరాబాద్?లో నీటికొరత ఏర్పడింది. జల మండలి లెక్కల ప్రకారం మార్చి, ఏప్రిల్?, మే నెలల్లో 2.17, 2.3, 3.1 లక్షల ట్యాంకర్ల వరకు బుక్కయ్యాయి. జులై మొదటి వారంలోనే 60 వేల ట్యాంకర్లను జలమండలి సరఫరా చేసింది. బహుళ అంతస్తుల భవనాలే ట్యాంకర్లపై ఎక్కువగా ఆధారపడుతున్నాయి.




కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లితో పోలిస్తే ఉప్పల్?లో భూగర్భ జలమట్టం కాస్త ఆశాజనకంగా ఉంది.

**అత్యంత తక్కువ వర్షపాతం నమోదు**

రాష్ట్రంలో అత్యంత తక్కువగా వర్షపాతం నమోదవుతున్న ప్రాంతాలు ఎక్కువగా ఉన్నాయి. ఇందులో మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా పరిస్థితి దారుణంగా ఉంది. తెలంగాణ అభివృద్ధి ప్రణాళిక సొసైటీ లెక్కల ప్రకారం సాధారణంగా 173.4 మి.మీ. పడాల్సి ఉండగా, 77.8 మి.మీ. మాత్రమే పడింది. ఈ జిల్లాలో మొత్తం 15 మండలాలున్నాయి. వీటిల్లో 8 మండలాల్లో లార్జ్? డెఫీషియెంట్? కేటగిరీలోకి 6 మండలాలను డెఫీషియెంట్ కేటగిరీలో చేర్చారు. బాచుపల్లిలో మాత్రమే సాధారణంగా ఎక్కువగా 215 మి.మీ. పడింది.

**నీటిని పొదుపు చేయడానికి ప్రణాళిక**

గతేడాది వేసవి కాలంలో నీటి ఎద్దటి ఎదుర్కొన్న ప్రాంతాల మ్యాప్?ను జలమండలి రూపొందించి ప్రణాళికలు రచిస్తుంది.కొత్తగా నీటి సమస్యను ఎదుర్కొంటున్న మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ ప్రాంతాలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టనున్నారు.రోజుకు 50 కిలోమీటర్ల నీటిని శుద్ధి చేసే సామర్థ్యం ఉన్న ప్రైవేటు ఎస్?టీపీ యజమానులకు కార్యశాలలు నిర్వహిస్తారు.కనీసం రెండు శాతం శుద్ధి చేసిన నీటిని వినియోగించేలా ఆ నీళ్లు ఎద్దడి సమయాల్లో ఉపయోగపడతాయని జలమండలి ఎదుర్కొంది.
క్యూర్ పరిధిలో తీవ్రమైన వర్షాభావ పరిస్థితులు కొనసాగుతున్నాయి. జూన్?లో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదు అయ్యింది. అత్యధిక వర్షపాతం నమోదు కావాల్సిన జులై నెలలోనూ ఇదే పరిస్థితి కొనసాగడం వల్ల భూగర్భ జలాలపై తీవ్ర ప్రభావం చూపుతోంది.

# తెలంగాణ స్ఫూర్తికి దక్కిన గౌరవం

### ⏭ టిఆర్ఎస్ నాయకుడు బొంగోని శంకరయ్య గౌడ్

**టీ మీడియా, జులై 16, పెద్దపల్లి జిల్లా ప్రతినిధి:**
తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ప్రకటించిన నియోజకవర్గ ఇన్‌చార్జ్‌ల జాబితాలో 12 మంది బీసీ నాయకులకు అవకాశం కల్పించడం పట్ల పలువురు బీసీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యంగా పెద్దపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా ఉద్యమకారుడు, బీసీ నాయకుడు సలేంద్ర కొమురయ్యను నియమించడం పార్టీ కోసం నిబద్ధతతో పనిచేసిన నాయకత్వానికి దక్కిన గుర్తింపుగా అభివర్ణించారు. ఈ సందర్భంగా టీఆర్ఎస్ నాయకుడు బొంగోని శంకర్ గౌడ్ మాట్లాడుతూ.. బీసీ సామాజిక వర్గాలకు సముచిత రాజకీయ ప్రాధాన్యత కల్పిస్తూ కల్వకుంట్ల కవిత తీసుకున్న నిర్ణయాన్ని మనస్ఫూర్తిగా స్వాగతిస్తున్నామని తెలిపారు. పార్టీ కోసం నిరంతరం శ్రమించే కార్యకర్తలు, ఉద్యమకారులను గుర్తించి వారికి తగిన బాధ్యతలు అప్పగించడం నాయకత్వ గొప్పతనానికి నిదర్శనమని అన్నారు. తెలంగాణ ఉద్యమ స్ఫూర్తికి దక్కిన గౌరవమని. బీసీలకు రాజకీయంగా మరింత ప్రాధాన్యత కల్పించే దిశగా కవిత తీసుకుంటున్న నిర్ణయాలు అభినందనీయమని , 2001 నుంచి తెలంగాణ రాష్ట్ర సాధన వరకు అలుపెరుగని పోరాటం చేసిన ఉద్యమ నాయకుడు సలేంద్ర కొమురయ్యకు పెద్దపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించడం పట్ల బీసీ బిడ్డలందరూ ఆనందం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. రానున్న రోజుల్లో బీసీలందరినీ ఏకం చేసి తెలంగాణ రక్షణ



సేనను మరింత బలోపేతం చేసేందుకు కల్వకుంట్ల కవిత నాయకత్వంలో పనిచేస్తామని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా బీసీ నాయకత్వానికి సముచిత ప్రాధాన్యత కల్పించి తమపై విశ్వాసం ఉంచిన తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత,హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ జిల్లా నాయకుడు చిలుక ఆనంద్, జిల్లా నాయకులు మల్యాల కరుణాకర్, అంబాల మహేష్, నల్లగొండ స్వామి, సుల్తానాబాద్ మండల నాయకుడు గుర్రం శ్రీనివాస్, ఓదెల మండల నాయకుడు పల్లె శ్రీనివాస్, అంతర్గాం మండల నాయకుడు రాజ్‌కుమార్ యాదవ్, పెద్దపల్లి మండల నాయకుడు సీహెచ్ హనుమన్నతో పాటు పలువురు ఉద్యమకారులు పాల్గొన్నారు.

# నీట్ పేపర్ లీక్

### ⏭ రూ.5లక్షలకు కెమిస్ట్రీ ప్రశ్నలు కొనుగోలు
### ⏭ చేసిన కోచింగ్ సెంటర్ యజమాని

**టి మీడియా, జూలై 16 ,ఢిల్లీ బ్యూరో :**
దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన నీట్–యూజీ 2026 ప్రశ్నాపత్రం లీక్ కేసు దర్యాప్తులో కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) మరో కీలక విషయాన్ని వెలుగులోకి తీసుకొచ్చింది. మహారాష్ట్రలోని లాతూర్‌కు చెందిన కోచింగ్ సెంటర్ యజమాని శివరాజ్ రఘునాథ్ మోటేగావ్‌కర్, పరీక్షకు ముందే కెమిస్ట్రీ ప్రశ్నలు సంపాదించేందుకు రూ.5 లక్షలు చెల్లించినట్లు ప్రత్యేక కోర్టుకు సీబీఐ తెలిపింది. ప్రశ్నాపత్రం లీక్ కుట్రలో మోటేగావ్?కర్ పాత్ర ఉందని, అతడిని బెయిల్ మంజూరు చేయవద్దని సీబీఐ కోరింది.
రూ.5 లక్షలకు కెమిస్ట్రీ ప్రశ్నాపత్రం
దిల్లీ రౌస్ అవెన్యూ ప్రత్యేక కోర్టులో దాఖలు చేసిన అఫిడవిట్‌లో, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) ప్రశ్నాపత్రాల రూపకల్పన కమిటీలో సభ్యుడిగా ఉన్న పీవీ కులకర్ణి నుంచి కెమిస్ట్రీ ప్రశ్నలు సేకరించినట్లు ఆరోపించింది. రూ.5 లక్షలు చెల్లించి మోటేగావ్‌కర్ తన సహ నిందితులతో కలిసి కుట్రపూరితంగా పరీక్షకు ముందే ప్రశ్నలు తెప్పించుకున్నట్లు కోర్టులో పేర్కొంది. ఈ వ్యవహారంలో మోటేగావ్‌కర్ కీలక పాత్ర పోషించాడని సీబీఐ పేర్కొంది. మోటేగావ్‌కర్




కుమారుడు కులకర్ణి నిర్వహిస్తున్న కెమిస్ట్రీ కోచింగ్ తరగతులకు హాజరవుతున్నట్లు తెలిపింది. ఆ తరగతుల్లోనే లీకైన ప్రశ్నలు అందించినట్లు ఆరోపించింది. అందిన ప్రశ్నలను మోటేగావ్‌కర్ స్వయంగా చేతితో నోట్స్ రూపంలో రాసుకున్నట్లు పేర్కొంది.

**మొబైల్‌లో 132 చేతిరాత ప్రశ్నలు**

దర్యాప్తులో భాగంగా స్వాధీనం చేసుకున్న మోటేగావ్‌కర్ మొబైల్ ఫోన్‌లో 36 చిత్రాలు లభించినట్లు సీబీఐ వెల్లడించింది. వాటిలో ఐదు డూప్లికేట్ చిత్రాలు ఉండగా, మొత్తం 132 చేతిరాత కెమిస్ట్రీ ప్రశ్నలు ఉన్నట్లు తెలిపింది. వీటిలో 111 ప్రశ్నలు ఎన్‌టీఏ రూపొందించిన నీట్–యూజీ 2026 అసలు మాస్టర్ ప్రశ్నాపత్రంలోని ప్రశ్నలతో సరిపోలినట్లు సీబీఐ పేర్కొంది. ఈ డిజిటల్ ఆధారాలు కేసులో కీలక సాక్ష్యాలుగా నిలుస్తాయని పేర్కొంది.

**పరీక్షకు 10 రోజుల ముందే ఫొటోలు**

మే 3న జరగాల్సిన నీట్ పరీక్షకు చాలా ముందుగానే, ఏప్రిల్ 23, 2026న మోటేగావ్‌కర్‌కు కెమిస్ట్రీ ప్రశ్నలు, వాటి సమాధానాలు అందినట్లు దర్యాప్తులో తేలిందని సీబీఐ తెలిపింది. లీకైన ప్రశ్నలు సమకూర్చేందుకు చెల్లించినట్లు ఆరోపిస్తున్న రూ.5 లక్షల నగదును సహ నిందితుడు మనోజ్ భగవాన్‌రావ్ షిరురే ఇచ్చిన సమాచారం ఆధారంగా స్వాధీనం చేసుకున్నట్లు కోర్టుకు తెలిపింది. అంతే కాకుండా మోటేగావ్‌కర్ విద్యార్థులకు తాను ఇచ్చిన ప్రశ్నలే అసలు నీట్ పరీక్షలో వస్తాయని చెబుతున్న వీడియో తమ వద్ద ఉన్నట్లు కోర్టుకు పేర్కొంది. ఈ వీడియో కూడా కేసులో ముఖ్యమైన సాక్ష్యంగా మారే అవకాశం ఉందని వెల్లడించింది.

**13 మంది కస్టడీ పొడిగింపు**

ఇదిలా ఉండగా, ఈ కేసులో అరెస్టైన 13 మంది నిందితుల జ్యుడీషియల్ కస్టడీని రౌస్ అవెన్యూ కోర్టు జులై 24 వరకు పొడిగించింది. కస్టడీ పొడిగించిన వారిలో శివరాజ్ రఘునాథ్ మోటేగావ్‌కర్, తేజస్ హర్షద్ కుమార్ షా, దినేశ్ బివాల్, వికాస్ బివాల్, మంగీలాల్ బివాల్, యశ్ యాదవ్, ప్రహ్లాద్ కులకర్ణి, డాక్టర్ మనోజ్ షిరురే, ధనంజయ్ లోఖండే, శుభమ్ ఖైర్నార్, మనీషా వాఘ్‌మారే, మనీషా మందారే, మనీషా సంజయ్ హవల్దార్ ఉన్నారు. వారిని జైలు నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కోర్టులో హాజరుపరిచారు.